న్యూజెర్సీ కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ

# వాళ్ళిద్దరూ

- జాస్తి రమాదేవి



చీకట్లను చీల్చుకొంటూ పరుగెడుతున్నది రైలు- కిటికీలోంచి బయటకు చూస్తోంది 'ఆమె'.

"తలనిండ పూదండ దాల్చిన రాణీ ..." అతను సన్నగా 'హమ్' చేస్తున్నాడు ఆమెకేసి చూస్తో.

బయటంతా వెన్నెల వాన. ఆ రైల్లోంచి దూకేసి 'ఆమె' చేయి పట్టుకుని అలా వెన్నెల్లో తడిసి ముద్దయిపోతూ, నేలా నింగీ కలుస్తున్న చోటికి పరుగులు తీయాలని వుంది అతనికి. ఆమె జడలోంచి జాజులవాసన, ఆమె శరీరపు పరిమళాన్ని కూడా కలుపుకొని మరీ తేలి వస్తోంది అతని దగ్గరకు. అతని మనసు కూడా వుయ్యాలలూగుతోంది శరీరంతో పాటు.

ఆమె చూస్తోనే వుంది బయటికి.

పైన 'దీపాల్లా' వెలుగుతోన్న నక్షత్రాలు-దూరంగా, చాలా దూరంగా 'నక్షత్రాల్లా' మినుకు మినుకుమంటో కన్పిస్తోన్న దీపాల వరుసలూ - ఆ అందాల్ని ఆమె కళ్ళనిండా నింపుకుంటోంది. కిటికీలోంచి చెంపల్ని తాకుతోన్న చల్లగాలి అతడి 'స్పర్శ'లా గిలిగింతలు పెడుతోంది. ఎర్రని సూర్యుణ్ణి తాకేందుకు ప్రయత్నిస్తోన్న మబ్బుల్లా ఆమె నుదుటిపై ఎర్రని బొట్టుని తాకేందుకు అల్లరిగా పరుచుకుంటున్నాయి గాలికి రేగుతున్న ముంగురులు. అతని చూపుల్లా వుంది బయట వెన్నెల. అతని తాలూకూ వూహల్తో ఆమె దేహంలో సన్నని 'పులకరింత'.

అతడిని చూడాల్సొంచి అలవోకగా కళ్ళెత్తింది.

అతను తనవేపే చూస్తున్నాడు-రెప్పలార్పడం కూడా ఇష్టంలేనట్టు. ప్రక్కన కూర్చుంటే ముఖం పూర్తిగా కన్పించదన్న బెంగతో ఎదురు సీట్లో కూర్చున్నాడు.

"కళ్ళెత్తితే సాలు, కనకాబిసేకాలు" అన్నాడు నవ్వుతో

ఆమె బిడియంగా తలవాల్చింది. వాలిపోయిన ఆమె కనురెప్పలపై పెదవులాన్చాలన్న వెర్రికోరికని అతడు బలవంతాన నిగ్రహించుకున్నాడు.

సిగ్గుతో ఎర్రబడిన చెంపల్లో కెంపులు-ఎర్రని పెదవులపై పగడాలు-తళతళలాడే ఆ కళ్ళల్లో నీలాలు-నవ్వినపుడు రాలికపోయే ముత్యాలు-బంగారు తీగలాంటి శరీరం-దేవుడు తనకోసమే శ్రద్ధగా తయారుచేసిన అద్భుతమైన ఆభరణంలా వుంది ఆమె.

"ఇం కా కాస్సేపు పడుకోరాదూ?" అన్నాడు తను. కూర్చుని కూర్చుని ఆమె తీగ నడుమెక్కడ నొప్పిపుడుతుందో అని దిగులుగా వుందతనికి.

ఆమె తల వూపింది అంగీకారంగా. అతను లేచి ఆమె కోసం ప్రక్కపరిచేడు-'మహారాణి'కోసం హంసతూలికా తల్పం సిద్ధం చేస్తున్నంత తదేకంగా, శ్రద్ధగా.

ఆమెకి గర్వంగా, సంతోషంగా, సిగ్గుగా వుంది అతను తనమీద చూపిస్తోన్న శ్రద్ధకి.

"మీరు కూడ పడుకోండి" అన్నదామె మృదువుగా-అతను పరిచిన ప్రక్కమీద కూర్చుంటూ.

"ఏమిటే, ఇక్కడే?" ఆశ్చర్యపోయేడు. ఆమె కంగారు పడింది.

"అంత బావుండదేమో? ఈ ఒక్క రాత్రికీ ఓర్చుకో డియర్" అతని కళ్ళలో అల్లరి -పెదవులపై కొంటె నవ్వు.

ఆమె పూచిన మందారమైంది సిగ్గుతో. కళ్ళెత్తి అతని వేపు కోపంగా చూడబోయింది. సాధ్యం కాలేదు.

అతను బుద్ధిస్తున్నట్టు సంకేతమందించేడు తన ప్రక్కమీద పడుకొంటూ.

ఆమె మనోహరంగా నవ్వుతూ-స్వీకరించినట్లు కళ్ళు రెపరెపలాడించింది.

ఇద్దరికీ నిద్ర రావడంలేదు. కళ్ళనిండా తీయతియ్యని కలలు-ఒంటినిండా పరువపు అలలు.

నిద్ర ఎలా వస్తుందీ?

వాళ్ళిద్దరూ నూతన 'వధూవరులు'. మూడురోజుల క్రిందటే వివాహమైంది. కొత్త కోర్కెలు, కొత్త రుచులు. కొత్త అనుభవాలు - ఇద్దరినీ నిలవనీయడంలేదు.

'తిరుపతి' దైవ దర్శనానికి వెళ్తున్నారు. అదే 'హనీమూన్' కూడ.

అతను 'రామకృష్ణ'. ఆమె 'శమంత'.

ఇద్దరి మధ్యా ఎడతెగని వూసులు-కమ్మని ఊసులు. కాలమే తెలియడంలేదు. వాళ్ళిద్దరూ - యవ్వనపు

జ్వాలల్లో రగుల్తోన్న యువతీ యువకులు.
వాళ్ళకిప్పుడు 'జీవితం' అంటే "మూడు ముద్దలూ–ఆరు కౌగిలింతలూను"

* * * * *

"ఏమండీ, కాస్త ఈ కిటికీ అద్దం దించెయ్యండి. పాపకి మరీ చల్లగాలి తగుల్తోంది" ఆమె పాపాయి చుట్టూ మెత్తగా దుప్పటి కప్పతూ చెప్పింది.
అతను వొడిలోనే నిద్రపోయిన బాబుని జాగ్రత్తగా తీసి ప్రక్కమీద పడుకోబెట్టేడు నిద్రాభంగం కాకుండా. తరువాత లేచి కిటికీ అద్దం క్రిందికి దింపేడు.
"పిల్లలు నిద్రపోయేరుగా? నువ్వు కూడా కొంచెం తిన కూడదూ?" అతను భార్యతో అన్నాడు ఆప్యాయంగా.
"మీరు తినలేదుగా? ఇద్దరం తినేద్దాం రండి. మళ్ళీ ఈ పిల్ల రాక్షసి లేచిందంటే ఇంక అంతే సంగతులు" ఆమె మురిపెంగా నిద్రపోతున్న పాపకేసి చూస్తూ చెప్పింది.
"నా కూతుర్ని అలా అనడానికి నీకు నోరెలా వస్తోందో? అది బంగారు తల్లి. ఇక మీదట దాన్నెప్పుడూ అలా అనకు" అతను చిరుకోపంతో మందలించేడు భార్యని.
అతడి చూపంతా 'పాపపైనే, రబ్బరు బొమ్మలా ఎంత ముద్దుగా వుందో? అందుకే పాపాయి పేరు 'వెన్నెల' అని పెట్టుకున్నాడు తను. చూడగా చూడగా తన 'దిష్టే' తగులుతుందేమో–చూపు త్రిప్పుకున్నాడు.
"అమ్మా" బాబు నిద్రలోనే కదిలేడు. ఆమె గభాలున లేచి బాబు ప్రక్కన కూర్చుని మృదువుగా జోకొట్టింది. బాబామెకి ప్రాణం.
'ఆమె'కి అలసటగా వుంది. చెంపలపైని లేతదనం కరిగిపోతోంది. ఆమె తీగ నడువు కొంచెం లావెక్కింది. ఆమెలోని 'అమ్మతనం' ఆమెకి పూర్ణత్వ అందాన్నిస్తోంది.
'ఆతను' కొంచెం పెద్దవాడయ్యేడు. కళ్ళలో 'తండ్రి' అయిన గర్వం. అనువైన అర్ధాంగి, జీవితాన్నంతా సందడితో నింపేస్తూ ఇద్దరు చిట్టి దేవుళ్ళు–ఇంకేం కావాలి? అసలీ పిల్లలు లేకముందు తామిద్దరూ ఎలా గడిపేరోని అతనికిప్పుడు ఆశ్చర్యం. వీళ్ళ రాకకోసం ఎనిమిదేళ్ళు నిరీక్షించాల్సి వచ్చింది తామిద్దరూ. ఎన్ని వైద్యాలు, ఎన్నెన్ని మొక్కుబడులు, ఎంత మానసిక వేదన? ఎలా గైతేనేం? చివరికి ఏ దేవుడో తమని కరుణించేడు. ఇంత వెలుగుని, సంతోషాన్ని నింపేడు జీవితాల్లో. ఈ బిడ్డలిద్దరినీ అరచేతిలో పువ్వుల్లా పెంచాలి. వీళ్ళకి ఏ లోటూ రానివ్వకూడదు జీవితంలో – ఎంత కష్టమైనా సరే – వాళ్ళ కంట నీరు రానివ్వకూడదు.
'అతను' ఆలోచిస్తున్నాడు. హఠాత్తుగా కూర్చున్నచోట చల్లగా, తడిగా అన్పించింది. అతనీ లోకంలోకి వొచ్చేడు.
"మీ వెన్నెల, పాపం వర్షం కురిపించినట్లుంది" ఆమె నవ్వుతూ పాప పక్కబట్టలు మార్చడానికి లేచింది.
అతను కూడా నవ్వేడు. భార్యకి సాయం చేసేడు పక్క మార్చడంలో.
పాపాయిని పడుకోబెట్టి ఆమె వాళ్ళిద్దరికీ టిఫిన్ సర్దింది ప్లేట్లలో. తిన్నాక ఆమె పాప ప్రక్కన చోటు చేసుకుంది నెమ్మదిగా. అతను బాబు ప్రక్కన వొరిగేడు జాగ్రత్తగా.
వాళ్ళిద్దరూ – అతను 'రామకృష్ణ', ఆమె 'శమంత'.
వాళ్ళిప్పుడు 'తిరుపతి' వెళ్తున్నారు – బాబుకి జుట్టు తీయించడానికి, పాపాయికి చెవులు కుట్టించడానికీ.
ఇద్దరికీ నిద్ర రావడంలేదు. పిల్లలకోసం ఏమేం చెయ్యాలి, వాళ్ళని ఏం చదివించాలి ... ఇలా ఎన్నో, ఎన్నెన్నో కబుర్లు – కాలమే తెలియడంలేదు. ఇదరి ఆలోచనలు, ఆశలు అన్నీ 'పిల్లలే'
వాళ్ళిద్దరూ ఇప్పుడు 'తల్లి – తండ్రి'.
వాళ్ళకిప్పుడు 'జీవితం' అంటే "మూడు బోసి నవ్వులు–ఆరు తప్పటడుగులూ"ను.

* * * * *

"ఏమండీ, ఈ మఫ్లర్ చెవులచుట్టూ కప్పకోండి. చలి గాలి తగిలితే మీకు వూపిరి పీల్చుకోవడం కష్టమవుతుంది మళ్ళీ" ఆమె వైరుబుట్టలో పైనే పెట్టిన మఫ్లర్ తీసి ఆయనకి అందించింది.
"వచ్చే స్టేషన్లో రైలు ఓ అరగంట ఆగుతుంది. అక్కడ తినడానికి ఏమైనా తీసుకుందాం. లేకుంటే ఆ తర్వాత తినేందుకేమీ దొరక్క ఇబ్బంది పడాల్సి వస్తుంది" ఆయన మఫ్లర్ తలకి చుట్టుకొంటూ చెప్పేరు.
"కనీసం దారిలో తినడానికింత టిఫినైనా చేసిచ్చింది కాదు కోడలు. ఆ అమ్మాయికి మనల్ని చూస్తేనే చిరాకు, ఎందుకో మరి" ఆమెకి కళ్ళలో నీళ్ళుబికి వొచ్చేయి తల్చుకుంటుంటే.
"వూరుకోవోయ్. అవన్నీ తల్చుకుంటూ కూర్చుంటే బ్రతకలేం. ఈ కాలంలో తల్లితండ్రులు అరటిచెట్ల వంటివాళ్ళు. గెల కోసుకోగానే చెట్టుని నరికేసినట్లు అవసరం తీరిపోగానే తల్లిదండ్రులు పిల్లలకి పనికిరాని వాళ్ళయిపోతారు. కాలం అలా వుంది. నలుగురితో పాటే మనమూను" ఆయన గొంతులో ఓదార్పు వున్నా, గుండెలోని విషాదం ఆమెకి తెలియకపోతే కదా?!
కొడుకూ–కోడలే కాదు. "ఆడపిల్లలకి ఆస్తుల్లో సమాన హక్కులు" అంటూ ఉపన్యాసాలిచ్చే కూతురు–అల్లుడూ, బరువు బాధ్యతలు భుజాన వేసుకోవడం అనేప్పటికి "తల్లిదండ్రులు కొడుకు దగ్గరుండటం మర్యాద"న్న పాత ధర్మం వేపు పరుగెత్తేరు.
కాలం ఆమె చెంపలపై ముడుతలుగా, అనుభవాలు ఆమె కళ్ళక్రింద చారలుగా మిగిలిపోయినయ్. ఆమె ఇప్పుడు వాడిపోయిన 'తమలపాకు'లా వుంది. ఆమె కళ్ళలో 'తళ తళ' లేదు. 'తడి తడి' తప్ప.

గుండెలమీద వేసుకుని అల్లారుముద్దుగా పెంచుకున్న పిల్లలిద్దరూ ఈరోజు ఆ గుండెలమీదే తన్నేసి "ఇంక మాకు మీరు వొద్దు" అన్నట్లు ప్రవర్తించడం ఆమె తట్టుకోలేకపోతున్నది.
ఆమె 'స్త్రీ' కాబట్టి నిస్సంకోచంగా, మనసు తీరా దుఃఖించగలుగుతోంది. ఆమె 'అమ్మ' కాబట్టి ఇప్పటికీ బిడ్డల్ని నిందించలేకపోతోంది.
ఆయనలో పూర్తి వృద్ధాప్యపు ఛాయలు, జీవితం తాలూకూ అలసట. ముఖంలో గాంభీర్యం కన్పిస్తోన్నా–గుండెల్లో అలజడి చెవులున్న (ఆమె) మనసుకి విన్పిస్తోనే వుంది. ఈ పరిస్థితి ఆయన కూడా ముందు వూహించుకున్నదేమీ కాదు. అందువల్ల ఆయనకీ మింగుడుపడటంలేదు.
ఈ సమస్యని అధిగమించే ప్రయత్నంలో వున్నారు వాళ్ళిద్దరూ. సమస్య కేవలం ఆర్థికమైనది కాకపోవచ్చు. అంతకన్నా ముఖ్యంగా ఆత్మీయత, ఆదరణదీను.
ఆయన తీసుకున్న నిర్ణయాన్ని ఆమెకి చెప్పి, ఆమెని వొప్పించడం కొంచెం కష్టమే అయింది ఆయనకి. అయినా, చివరికి ఆయన చెప్పిన మార్గమే ఉత్తమమైనదిగా అంగీకరించక తప్పలేదు ఆమెకి.
వాళ్ళిద్దరూ – అవును వాళ్ళిద్దరే.
ఆయన – 'రామకృష్ణ', ఆమె 'శమంత'.
వాళ్ళిప్పుడు వెళ్తోంది కూడా 'తిరుపతి'కే. స్నేహితుడి ద్వారా దొరికింది ఆ అవకాశం. అక్కడున్న 'అనాథ శరణాలయం'లో ఉచితంగా సేవలందించేందుకు, తమ శేషజీవితం తమలాంటి అనాథల మధ్య ఆత్మీయతని పంచుకొంటూ గడిపేందుకు వెళ్తున్నారు.
ఇద్దరూ తమ బాధల్ని మరిచి 'శరణాలయం' కబుర్లలో పడ్డారు. లోకంలో దీనులకి, గాధలకి, బాధలకి ఏం తక్కువ? వాళ్ళకి కాలమే తెలియడంలేదు.
ప్రొద్దువాలుతోన్న ఈ వయసులో వొకరి నిజమైన తోడు–నీడగా, ఆత్మీయత, అనురాగం, స్నేహం వొకరికొకరు అందించుకుంటూ–
వాళ్ళిద్దరూ–ఇప్పుడు అసలైన "భార్యాభర్తలు".
వాళ్ళకిప్పుడు 'జీవితం' అంటే "మూడు అనుభవాలు–ఆరు పాఠాలూను".

## సముద్ర ఘోష

ఉవ్వెత్తున లేస్తున్న
కెరటాల సవ్వడి వింటున్న,
మదిలో చేరి చేసిన
అల్లరులలో తేలుస్తున్న,
క్షణికానందం పొందుతున్న
ముసి ముసి నవ్వుకుంటున్న,
మల్లెకు తెలుసు తను
బ్రతికేది ఒక్క రాత్రేనని
కెరటానికి తెలుసు ఎంత
ఎత్తున ఎగిరిన ఆకాశాన్ని
అందుకోలేనని. అయినా
మల్లె ఇస్తుంది కమ్మని వాసన
కెరటాలు ఇస్తాయి మనోల్లాసం
మమ్మల్ని చూడగానే
పలుకరించేవు కుశలమేనా? అని
ఆనందాన్ని పంచుకొనేవు
మేం ఇంటికి వెళ్ళేవేళ
దీనపు చూపులు విసిరేవు
నన్ను ఒంటిగ మిగల్చకు
ఓ నేస్తమా తోడుండమని.

దూపాటి శేషుకుమారా చార్యులు
**Sarapaka, AP**

